సాక్షి
ఆదిలాబాద్
గురువారం ꞏ 14 ꞏ డిసెంబర్ ꞏ 2023

‘అభయ హస్తం’పై ఆశలు



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో అభయ హస్తం పథకం పునరుద్ధరిస్తే బాగుంటుందని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు. 9లో▸

నేడు ‘పాయల్’ ప్రమాణ స్వీకారం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ వ్యవహరించడాన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు ఇటీవల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గైర్హాజరైన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ ఎన్నిక కావడంతో నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/16.0

పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్

కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాహుల్ రాజ్ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. అలాగే ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నలందప్రియ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

22న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కైలాస్‌నగర్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవ పోటీలు ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, డిక్లమేషన్, ఎల్యూకేషన్, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ, హ్యాండిక్రాఫ్ట్, టెక్స్‌టైల్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అంశానికి సంబంధించిన సామగ్రిని వెంట తెచ్చుకోవాలని, ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్‌లో పది మంది కంటే ఎక్కువ సభ్యులు ఉండరాదని పేర్కొన్నారు. ఫోక్ డ్యాన్స్‌కు 15 నిమిషాలు, ఫోక్ సాంగ్‌కు 7 నిమిషాల సమయం కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు సెట్విన్ కార్యాలయంలో ఈనెల 21లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 94408 43848, 9381303380 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు బాధ్యతగా పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శైలజ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ సిబ్బందికి ఎన్నికల విధులు ఉండడంతో పన్నుల వసూలు చేయలేకపోయారని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రూ.5కోట్ల 35లక్షల ఆస్తి పన్ను, రూ.8 కోట్ల వరకు నీటి పన్ను, రూ.కోటి వరకు ట్రేడ్ లైసెన్సులకు సంబంధించినవి వసూలు కావాల్సి ఉన్నాయన్నారు. ప్రజలు చెల్లించే పన్నులపైనే మున్సిపల్ నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఇంటి నల్లా కనెక్షన్ ఉన్నవారంతా రూ.వంద చొప్పున చెల్లించాలని, ఇది కేవలం మోటార్ల ద్వారా నీటిని అందించే క్రమంలో విద్యుత్ చార్జీల కోసం మాత్రమేనని తెలిపారు. ప్రజలు సహకరించి ఇంటికి వచ్చే సిబ్బందికి పన్ను చెల్లించాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి



లింగట్లలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

నేరడిగొండ: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్, లింగట్ల గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు గ్రామస్తులు సహకరించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రోజువారి చెత్త సేకరణ చేపట్టి డంప్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. వాటితో సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో శోభన, పంచాయతీ కార్యదర్శులు రజిత, శ్రీకాంత్ తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

అనుగృహమేనా..!?

- గృహ నిర్మాణ సంస్థ పునరుద్ధరణ యోచనలో సర్కారు
- ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రాధాన్యత నేపథ్యంలో..
- ఈ నెలాఖరు వరకు పూర్తిస్థాయి మార్గదర్శకాలు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన వివరాలు..

కలెక్టర్ మంజూరు ఇచ్చినవి	3,579
టెండర్ పూర్తయినవి	2,335
నిర్మాణం పూర్తయినవి	638
వివిధ దశల్లో ఉన్నవి	1697

సాక్షి,ఆదిలాబాద్: గృహ నిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయం తలుపులు మళ్లీ తెరుచుకునే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఈ సంస్థను పునరుద్ధరణ చేసే యోచనలో ఉంది. గతంలో గృహ నిర్మాణాల పరంగా ఈ సంస్థదే కీలక పాత్ర. అయితే ఏడాది క్రితం దీన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీలో విలీనం చేసింది. దీంతో స్వయంప్రతిపత్తి కోల్పోయింది. మళ్లీ ఈ సంస్థను పునరుద్ధరించనున్నట్లు యోచిస్తున్న నేపథ్యంలో హర్షం వ్యక్తమవుతోంది.

బాధ్యత వరకే పరిమితం..

బీఆర్‌ఎస్ సర్కార్‌లో గృహ నిర్మాణ సంస్థను విలీనం చేసిన తర్వాత నోడల్ ఆఫీసర్‌గా ఈ సంస్థకు చెందిన అధికారి బసవేశ్వర్ వ్యవహరిస్తున్నారు. సంస్థకు చెందిన నలుగురు అధికారులు మాత్రమే ప్రస్తుతం బాధ్యతల నిర్వహణలో ఉన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్ నుంచి సాంక్షన్ వచ్చినటువంటి ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో అమలు, వాటి పురోగతి, బిల్లుల చెల్లింపునకు సంబంధించి నివేదిక రూపొందించే వరకే ఈ నోడల్ అధికారులదే బాధ్యత. ఇక ఇళ్ల నిర్మాణాన్ని అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ (కార్యనిర్వాహక) ఏజెన్సీలుగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించింది. ఆయా శాఖల ఆధ్వర్యంలోనే బీఆర్‌ఎస్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన డబుల్ బెడ్‌రూమ్ గృహాల నిర్మాణ పనులు సాగాయి. తద్వారా పురోగతి నివేదికల తయారీ వరకు మాత్రమే నోడల్ అధికారుల బాధ్యత ఉండేది. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణం పూర్తిగా ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ఆధ్వర్యంలో సాగేది.

పునరుద్ధరిస్తే..

గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరిస్తే దీనికి మళ్లీ పూర్వ వైభవం వస్తుందన్న ఆనందం సంస్థలో ప్రస్తుతం బాధ్యత నిర్వహిస్తున్న కొంత మంది అధికారుల్లో వ్యక్తమవుతుంది. ఈ సంస్థకు సంబంధించి హైదరాబాద్‌లో కార్పొరేషన్ అదే విధంగా కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో గృహ నిర్మాణ సంస్థకు సంబంధించి ముందు నుంచి ఉన్న కార్యాలయంలోనే నోడల్ అధికారుల ఆఫీస్ కొనసాగుతుంది. అయితే ఇందులో వేళ్ల మీద లెక్కించే సిబ్బంది మాత్రమే ప్రస్తుతం కనిపిస్తారు. విలీనానికి ముందు ఈ సంస్థ కార్యాలయంలో నిత్యం క్షేత్రస్థాయి సిబ్బంది రాకపోకలు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ, నివేదికల తయారీ అన్నీ ఇక్కడినుంచే సాగేవి. మళ్లీ పునరుద్ధరణకు నోచుకుంటే క్షేత్రస్థాయిలో డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇలా అన్ని పోస్టులను పునరుద్ధరించే పరిస్థితి ఉంటుంది. తద్వారా ఈ శాఖకు మళ్లీ వైభవం వస్తుందని అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇక్కడినుంచే మంజూరు ఇవ్వడం, కార్యాలయం నుంచే పనుల నివేదికలు రూపొందించడం, క్షేత్రస్థాయిలో సొంత సిబ్బందితో నిర్మాణం చేపట్టడం వంటివి జరుగుతాయి. కాంగ్రెస్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రాధాన్యత అంశంతో ముందుకొస్తున్న నేపథ్యంలో ఈ సంస్థకు గత వైభవం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

మార్గదర్శకాలు రాలేదు



గృహ నిర్మాణ సంస్థ పునరుద్ధరణకు సంబంధించి ఇప్పటివరకు మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే మాత్రం దానికి అనుగుణంగా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు చేపడతాం. ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నోడల్ ఆఫీసర్‌గా పర్యవేక్షణ చేయడం జరిగింది. సంస్థ పునరుద్ధరించిన పక్షంలో మళ్లీ మాతృశాఖలో పనిచేయడం జరుగుతుంది.

– బసవేశ్వర్, నోడల్ అధికారి, గృహ నిర్మాణ సంస్థ, ఆదిలాబాద్



మావల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ (ఫైల్)

‘బ్రేక్’ ఫాస్ట్!

- పాఠశాలల్లో ఆగిన ‘అల్పాహార’ పథకం
- అక్టోబర్‌లో ప్రారంభం.. డిసెంబర్‌లో నిలిపివేత
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- నిధులు లేకనే అంటున్న నిర్వాహకులు

మావల మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో అక్టోబర్ 26 నుంచి అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్)పథకాన్ని ప్రారంభించారు. ఈ పాఠశాలలో 102 మంది విద్యార్థులు చదువుతున్నారు. రోజుకు 90 మంది వరకు బ్రేక్‌ఫాస్ట్ అందించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దొడ్డు, సన్నటి రవ్వ, పులిహోర, అటుకులు, పూరి, కిచిడి, చట్నీ, సాంబర్ వంటివి పెట్టారు. అయితే ఈ పథకాన్ని ప్రస్తుతం నిలిపివేయాలని ఎమ్మార్సీ నుంచి ప్రధానోపాధ్యాయులకు మౌఖికంగా తెలిపారు. దీంతో నాలుగు రోజులుగా విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు.

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు గత ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్‌లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఎలాంటి నిధులు విడుదల చేయకుండానే ఆగమేఘాలపై ప్రారంభించింది. అయితే నెలరోజులకే పథకం అభాసుపాలైంది. దసరా సెలవులకు ముందు పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున పాఠశాలలను ఎంపిక చేసింది. నవంబర్‌లో మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసినప్పటికీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతమైతే బ్రేక్‌ఫాస్ట్ పూర్తిగా నిలిచిపోయింది.

పస్తులు ఉండకుండా..

గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు వివిధ పనులు, పంట చేలకు వెళ్లడంతో చాలా మంది విద్యార్థులు పస్తులతోనే ఉదయం బడికి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేంత వరకు నిరీక్షించి నీరసించిపోతున్నారు. దీంతో ఆ సమయంలో చదువుపై శ్రద్ధ పెట్టకుండా ఉండటం, ఆరోగ్యం క్షీణించిపోతుండడంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్పాహారం పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇది నిలిచిపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ లేకుండానే వారు బడులకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనం వరకు అలాగే ఉండాల్సిన పరిస్థితి. కాగా మొదట నియోజకవర్గానికి రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. దసరా సెలవుల తర్వాత నవంబర్‌లో మండలానికి ఒకటి చొప్పున 18 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకం నిర్వహణ కోసం ఒక్కో విద్యార్థికి రూ.10.50 పైసలు చొప్పున నిర్ణయించినప్పటికీ విధివిధానాలు, ఉత్తర్వులు జారీ కాలేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అదనపు భారం కావడంతో ఈ పథకాన్ని ప్రారంభించిన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులే నిధులు సమకూర్చారు. అక్టోబర్‌లో 7,664 మంది విద్యార్థులకు గాను 5,289 మంది విద్యార్థులు అల్పాహారం చేశారు. నవంబర్‌లో 27,070 మంది విద్యార్థులకు గాను 18,953 మంది బ్రేక్‌ఫాస్ట్ చేశారు. 672 మంది సిబ్బంది పనిచేశారు. ఈ బ్రేక్‌ఫాస్ట్ కోసం ఖర్చు చేసిన డబ్బులకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కానీ, ప్రభుత్వం గానీ నోరెత్తకపోవడంతో నిధులు సమకూర్చిన ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు లబోదిబోమంటున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	925	46,344
ప్రాథమికోన్నత	111	25,122
ఉన్నత	110	12,089
మొత్తం	1146	83,555

విద్యార్థులకు దక్కని ప్రయోజనం..

సర్కారు బడుల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటుబుక్‌లు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న మాదిరిగానే అల్పాహారం పథకాన్ని ప్రారంభించగా మధ్యలోనే నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తారా.. లేదా అన్న అయోమయం నెలకొంది. జిల్లాలో 1146 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 83,555 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి ప్రస్తుతం మధ్యాహ్న భోజనం అందిస్తుండగా, ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు.

తాత్కాలికంగా బ్రేక్..



జిల్లాలో అల్పాహార పథకానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రభుత్వం నుంచి దీనికి సంబంధించి ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో నిర్వాహకులు బిల్లులు అడుగుతున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. – ప్రణీత, డీఈవో

క్షయ నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. రిమ్స్ ఆవరణలోని టీబీ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం తగదన్నారు. సకాలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య చికిత్స అందించాలని సూచించారు. వారిలో మనోధైర్యం నింపి క్షయ రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. బాధితులు మందులు వేసుకుంటున్నారా.. లేదా, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలన్నారు. సమావేశంలో క్షయ నివారణ అధికారి సాయిప్రియ, వైద్యాధికారులు, సిబ్బంది ప్రసాద్, శ్రీకాంత్, వినోద్ కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు అరికట్టాలి



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి మిల్కా

ఆదిలాబాద్‌టౌన్: మహిళలపై వేధింపులు, హింస అరికట్టాలని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా అన్నారు. సఖీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రచారోద్యమం ముగింపు కార్యక్రమాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో భార్యభర్తలు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అసమానతలు తొలగిపోవాలంటే చదువు, జ్ఞానంతోనే సాధ్యమవుతుందన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. మహిళలు, యువతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి తదితరులు మాట్లాడారు. స్మార్ట్ ఫోన్ లాభనష్టాలు, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యులు సమీరుల్లా ఖాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, డీఈవో ప్రణీత, మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు జీడీఎస్‌ల సమ్మె



సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని జీడీఎస్‌లు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసు ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ నాయకులు బుధవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ.. పోస్టల్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులు అన్నింటిని వెంటనే అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అంతకు ముందు జీడీఎస్‌లు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, జీడీఎస్ పీజేసీఏ ఆదిలాబాద్ డివిజన్ చైర్మన్ శ్రీనివాస్, కన్వీనర్ జాదవ్ కిరణ్, జీడీఎస్‌లు, ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న పుల్లయ్య

ఆదిలాబాద్‌టౌన్: పంటల వివరాల నమోదుపై ఏవోలు, ఏఈఓలు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల వివరాలను సకాలంలో నమోదు చేయాలన్నారు. అలాగే యాసంగి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చాలా మంది రైతులు ఇంకా పంటల సాగు షురూ చేయలేదని, త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, యాసంగి పంటలపై సమీక్షించారు. సమావేశంలో ఏడీఏలు, ఏవోలు రమేశ్, శ్రీధర్, రాంకిషన్, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూడైస్‌లో వెనుకంజ

- గతేడాది మావల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవనం శిథిలావస్థకు చేరినప్పటికీ అక్కడి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయలేదు. దీంతో మన ఊరు–మన బడిలో కార్యక్రమంలో ఆ పాఠశాల ఎంపిక కాలేదు. బిక్కు బిక్కుమంటూ విద్యార్థులు పురాతన భవనంలోనే చదువులు కొనసాగించారు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతుండడాన్ని ‘సాక్షి’ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో కలెక్టర్ స్పందించి ఆ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేశారు.

- విద్యార్థుల నమోదులో జిల్లా 27వ స్థానం
- పాఠశాలల వివరాల అప్‌డేట్‌లో 25వ ప్లేస్
- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- రేపటితో ముగియనున్న గడువు



యూడైస్ నిర్వహణపై సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: అధికారుల నిర్లక్ష్యం, కొంత మంది ఉపాధ్యాయుల అలసత్వం కారణంగా విద్యాశాఖ అభాసు పాలవుతోంది. ఏ కార్యక్రమంలోనూ జిల్లా ముందంజలో ఉండటం లేదు. ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారుల తీరు మారట్లేదు. తాజాగా యూడైస్‌కు సంబంధించి రాష్ట్రస్థాయిలో జిల్లా అధమ స్థానంలో నిలవడం గమనార్హం. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను ఈనెల 15 వరకు యూడైస్ ప్లస్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటికీ 50 శాతం కూడా పూర్తి కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారులు చెప్పినప్పటికీ ఉపాధ్యాయులు పెడచెవిన పెడుతుండడంతో ఈ పరిస్థితి ఉందని తెలుస్తోంది. వీరి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులతో పాటు పాఠశాలకు నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. యూడైస్‌లో వివరాలు నమోదు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలకు నిధులు విడుదలవుతాయి. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాల సరఫరా, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న దానిపై నిర్లక్ష్యం వహిస్తుండడం గమనార్హం.

తీరుమారదా..

జిల్లాలో విద్యాశాఖ అధికారులతో పాటు చాలా మంది ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతి కార్యక్రమం అభాసు పాలవుతోందనే విమర్శలున్నాయి. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తమను ఎవరేమి చేయలేరనే ధీమాతో కొంతమంది ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి నిర్లక్ష్యం కారణంగా ఇటు పాఠశాలతో పాటు అటు విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

వివరాల నమోదులో వెనుకంజ..

యూడైస్ ప్లస్ ఆన్‌లైన్ నమోదుకు ఈనెల 15 వరకు గడువు ఉంది. మరో రెండు రోజులే మిగిలి ఉండడంతో విద్యార్థులు, పాఠశాల మౌలిక వసతుల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయడం అనుమానంగానే కనిపిస్తోంది. యూడైస్ ప్లస్ పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాల నమోదులో జిల్లా 25వ స్థానంలో ఉంది. 1,481 పాఠశాలలకు గాను ఇంకా 772 పాఠశాలల వివరాలు నమోదు చేయలేదు. బుధవారం నాటికి 709 పాఠశాలల వివరాలతో 47.87 శాతం నమోదు కాగా, రాష్ట్రంలో కింది వరుసలో నిలిచింది. అలాగే విద్యార్థుల వివరాల నమోదులో మరింతగా వెనుకబడింది. రాష్ట్రస్థాయిలో 27వ స్థానానికి పరిమితమైంది. 1,431 పాఠశాలల్లో 1,51,740 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 75,467 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే నమోదు చేశారు. 60,401 మంది విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. 49.73 శాతం నమోదైంది.

గడువులోపు పూర్తి చేస్తాం..

యూడైస్ ప్లస్‌లో వివరాల నమోదు గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం. రాష్ట్రంలో జిల్లా పరంగా కొంత వెనుకబడి ఉన్న విషయం వాస్తవమే. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– నారాయణ, సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

కుంటాలను సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవోలు



ఎఫ్‌బీవోలతో డిప్యూటీ డైరెక్టర్ సంగీత

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతాన్ని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపెల్లి ట్రెయినీ ఎఫ్‌బీవోలు బుధవారం సందర్శించారు. 34వ బ్యాచ్‌కు చెందిన ఎఫ్‌బీవోలతో పాటు డిప్యూటీ డైరెక్టర్ సంగీత జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందారు. ఈ సందర్భంగా సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్ జలపాతం విశిష్టతలను ట్రైనీ ఎఫ్‌బీవోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కుంటాల ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటేశ్(ఫైల్)

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ వద్ద రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన ఎలంత్రవార్ వెంకటేశ్ (25) మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకారం.. డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్ ఆర్మూర్‌లో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమానికి డీజే సామగ్రి వాహనంలో నిర్మల్ నుంచి వెళ్తుండగా బాల్కొండ వద్ద రోడ్డుపై నిలిపి ఉన్న మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బొలేరో వాహనంలోని వెంకటేశ్ మృతిచెందాడు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఉత్సాహంగా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి, అండర్ 14 జిల్లా స్థాయి బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా క్రికెటర్ల మెళకువలను శిక్షకులు పరిశీలించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అంశాల్లో అత్యుత్తమంగా రాణించిన వారిని ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతోందని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈనెల 15వ తేదీన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆయన వెంట పోటీల ఆర్గనైజర్ దయానంద్‌రెడ్డి ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: హత్యాయత్నం కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గణేష్ మందిర్‌లో ఉండే కార్తీక్‌పై దాడిచేసిన ఖుర్షీద్‌నగర్‌కు చెందిన శంషీర్, మరో కేసుకు సంబంధించి ఇమ్రాన్, దిల్షద్ ఖాన్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వేడెక్కిన రాజకీయం

- ఎంపీపీ, వైస్ ఎంపీపీపై బీజేపీ అవిశ్వాసం
- పదవికి రాజీనామా చేసిన ఎంపీపీ
- వైస్ ఎంపీపీకి బాధ్యతలు



ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానాన్ని అందిస్తున్న బీజేపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు

సారంగపూర్: మండల రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. నిన్న మొన్నటివరకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చర్చించుకుంటూ రాజకీయ పరిస్థితులను అంచనా వేసుకున్న వివిధ పార్టీల నేతలు మండల ఎంపీపీపై దృష్టి సారించాయి. తాజాగా బీజేపీకి చెందిన 9మంది ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధలపై అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవో రత్నకుమారికి అందజేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందే 14మంది ఎంపీటీసీ సభ్యులలో పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరారు. అయితే ఎన్నికల అనంతరం బీజేపీకి చెందిన 9మంది ఎంపీటీసీలు కలిసి ఎంపీపీ మహిపాల్‌రెడ్డిపై అవిశ్వాసం దిశగా అడుగులు వేశారు. వారు ముందుగా చేసుకున్న వ్యూహం మేరకు అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవోకు అందజేయడంతో ఒక్కసారిగా మండలంలో ప్రజలు మళ్లీ ఎంపీపీ ఎవరికిస్తారోనన్న మీమాంస మొదలైంది.

ఎంపీపీ పదవికి మహిపాల్‌రెడ్డి రాజీనామా...

నాలుగు సంవత్సరాల ఆరునెలల పాటు ఎంపీపీగా విధులు నిర్వర్తించిన మహిపాల్‌రెడ్డి తనపై అవిశ్వాసం పెట్టవచ్చన్న ఊహగానాలు వినిపించడంతో ఆయనే స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేసి సదరు రాజీనామా పత్రాన్ని జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ శంకర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామాను ఆమోదించారు. ఈ విషయమై ఎంపీపీని వివరణ కోరగా తాను మంత్రి ఐకేరెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశానని తెలిపారు.



రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈవోకు అందిస్తున్న మహిపాల్‌రెడ్డి

రెండు గంటల్లోనే..

ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తన ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన అనంతరం రాజీనామాను ఆమోదించిన జెడ్పీ సీఈఓ మండల ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్న పతాని రాధ ఎంపీపీగా బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డిలు వెనువెంటనే రెండుగంటల్లో ఎంపీపీ బాధ్యతలను రాధకు అప్పగించారు. దీంతో తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మండల ప్రజల్లో అయోమయం మొదలైంది. తాజాగా నిర్మల్‌లో ఎమ్మెల్యే స్థానం కైవసం చేసుకున్న బీజేపీకి మెజార్టీ ఎంపీటీసీలు ఉండగా మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన మండల ఉపాధ్యక్షురాలు ఎంపీపీగా బాధ్యతల స్వీకరణతో మండల వాసుల్లో చర్చ మొదలైంది. అయితే బీజేపీ ఎంపీటీసీ సభ్యులు మాత్రం అటు ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం ప్రకటించడంతో తాజాగా ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన పతాని రాధ అవిశ్వాసం ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు...

మహిపాల్‌రెడ్డి రాజీనామా అనంతరం ఉపాధ్యక్షురాలిగా కొనసాగిన రాధ ఎంపీపీగా బాధ్యతలను స్వీకరించడంతో నాయకులు మాధవరావు, అయిర నారాయణరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయిటి చందు, పతాని భూమేష్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, ఇస్మాయిల్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

- ఆర్ జేడీ సత్యనారాయణ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ జేడీ సత్యనారాయణ

బజార్‌హత్నూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆర్‌జేడీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల, పిప్రి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనను మెరుగు పరుచుటకు తరగతి గదుల్లో నిర్వహిస్తున్న ఉన్నతి కార్యక్రమం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమేష్, విద్యాసాగర్, కౌసల్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

10 కిలోల కణితి తొలగింపు



తొలగించిన కణితిని చూపిస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం కౌట్ల (బి) గ్రామానికి చెందిన యువతి తీవ్ర కడుపు నొప్పితో జిల్లా కేంద్రంలోని స్వప్న ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రి జనరల్ సర్జన్ పరీక్షించి సిటీ స్కానింగ్ ఆధారంగా కడుపులో పెద్ద అండాశయ గడ్డ ఉన్నట్లు గుర్తించాడు. బుధవారం ఆపరేషన్ చేసి పదికిలోల గడ్డను తొలగించారు. జనరల్ సర్జన్లు శశికాంత్, గిరీష్ కుమార్ ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గురుకులాల్లో మెరుగైన విద్యాబోధన

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు భోజన వసతి కల్పించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల కళాశాలలో ఉమ్మడి జిల్లా గురుకుల ప్రిన్సిపాళ్లతో గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధిస్తూ వెనుకబడి ఉన్న విద్యార్థులపై దృష్టి సారించి వారి విద్యలో రాణించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. సులువైన రీతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. మంచి విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థులకు వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉన్నత విద్య చదువుతున్న గిరిజన అభ్యర్థులు నేషనల్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. అభ్యర్థుల వయసు 1–7–2023 నాటికి 36 ఏళ్లు మించరాదన్నారు. దీనికి ఎటువంటి ఆదాయ పరిమితిలేదని, స్కాలర్‌షిప్ కోసం http://scholarships.gov.in/ ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారానికి http//tribal.nic.in/downlods/guidelines/top వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



ముధోల్‌లో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ముధోల్: మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం రద్దు చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రం ముధోల్‌లోని చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవన ఉపాధిని దెబ్బతీసిందని, రోజువారి కుటుంబ పోషణ కష్టంగా మారిందని ప్రయాణికులు ఎవరు ఆటోలో ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ఆలోచనను మానుకుని ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. రహదారిపైన వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్లకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు లింగన్న, ఆటో యూనియన్ సభ్యులు ప్రవీణ్, సాయినాథ్ అశోక్, అంజి, సయ్యద్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీరాజరాజేశ్వరాలయంలో మంగళవారం రాత్రి హుండీని పగలగొడ్డి అందులోని నగదును ఎత్తుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం అర్చకుడు జ్ఞానేశ్వర్ పూజచేసి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం పూజచేసే సమయంలో హుండీ తాళం పగలగొట్టి ఉన్నట్లు గుర్తించాడు. ఏఎస్సై దేవ్‌రావు చేరుకుని వివరాలు సేకరించారు.

మనోధైర్యం ఉంటే అన్నీ సాధ్యమే



బహుమతులు అందిస్తున్న డీడబ్ల్యూవో మిల్కా

ఆదిలాబాద్: మనో ధైర్యం ఉంటే అన్ని సాధ్యమని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం దివ్యాంగుల క్రీడోత్సవాలను డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఏదైనా లక్ష్యాన్ని ఏర్పర్చుకుని దానికోసం పాటుపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. జీవితంలో ఎప్పుడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, అన్ని రంగాల్లో రాణించేలా ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. పలు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్ 14, 17 జిల్లా స్థాయి హాకీ ఎంపిక పోటీల్లో ఇచ్చోడ మండలం బోరిగామ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన అవినాశ్, రాజ్‌కుమార్, లింగన్న, అబ్బు, అక్షర, వైష్ణవి, సాయిప్రియ, పవిత్ర, అలేఖ్య, గాయత్రి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, పీఈటీ రవీందర్ అభినందించారు.





బడీడు పిల్లలు బయటేనా..!

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఏటా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం పూర్తిస్థాయిలో అమలుకు నోచడం లేదు. కొందరు పిల్లలు ఇప్పటికీ కుటుంబ పోషణకు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న పిల్లలు కుటుంబ పోషణకు తమ గ్రామంలోని గొర్రెల మందను కాసేందుకు ఏడాదికి రూ.50వేల చొప్పున పని కుదుర్చుకున్నవారే. అధికారులు స్పందించి ఇలాంటి వారిని బడికి పంపించేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, నిర్మల్

శనగ సాగే శ్రేయస్కరం



శనగ పంట (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు చేసిన పంట దిగుబడులు వస్తున్నాయి. దీంతో కొద్దిరోజుల నుంచి రైతులు యాసంగి సాగుకు శ్రీకారం చుట్టారు. వానాకాలం సాగు చేసిన వరి నారుమళ్లలో తేమ శాతం ఎక్కువగా ఉన్న రైతులు శనగ సాగు చేసుకుంటే శ్రేయస్కారంగా ఉంటుంది. యాసంగిలో వరికి బదులుగా పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ సూచిస్తున్నారు. పప్పు దినుసులకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సా గు చేసుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చంటున్నారు. పంట సాగుకు చేపట్టాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాటల్లోనే...

- యాసంగిలో అనువైన పంట
- నల్లరేగడి నేలలు అనుకూలం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో శనగ సాగుకు అనుకూలమైన నేలలు 70 శాతం ఉన్నాయి. అంతేకాకుండా కొద్దిపాటి నీటితడులతో పంట సాగు చేసుకోవచ్చు. జిల్లాలో చలి వాతావరణం ఎక్కువగా ఉండటం, డిసెంబర్, జనవరి మాసాల్లో మంచు ఎక్కువగా కురుస్తుండడం వలన పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. నవంబర్ నుంచి డిసెంబర్ చివరి వరకు విత్తనం విత్తుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. పంట సాగులో కొద్దిపాటి సూచనలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

విత్తనం వేసుకునే సమయం..

యాసంగిలో నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు శనగ సాగు చేసుకోవచ్చు. డిసెంబర్ తర్వాత విత్తుకుంటే పూత, కాత సమయంలో వాతావరణ మార్పులతో పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

నేలలు..

సారవంతమైన నల్లరేగడి నేలలు శనగ సాగుకు అనుకూలం. నల్లరేగడి నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ శీతాకాలంలో మంచుతో మొక్కల్లో పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో విత్తితే ఆశించిన దిగుబడి రాదు. తొలకరిలో వేసిన వరి పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేయాలి.

విత్తన రకాలు

శ్వేతరకం: ఈ విత్తనం 80 నుంచి 85 రోజుల వ్యవధిలో పంట దిగుబడి చేతికొస్తుంది. త్వరగా కాపుకు వచ్చే రకం. ఎండ, తెగులును తట్టుకునే కాబూలి రకం ఆలస్యంగా వేసుకోవడానికి అనుకూలం. నవంబర్ తర్వాత కూడా విత్తుకునే అవకాశం ఉంటుంది.

క్రాంతి: మొక్కలు గుబురుగా పెరిగి గింజలు మధ్య స్థలం కాసి లావుగా ఉంటాయి. ఎండు తెగులును తట్టుకునే రకం. 100 నుంచి 105 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

అన్నెగిరి: మొక్కలు గుబురుగా పెరిగి, కొమ్మలు ఎక్కువగా వేస్తుంది. గింజలు గోధుమ రంగులో నున్నగా, లావుగా ఉంటాయి. 100 నుంచి 110 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

జ్యోతి: మొక్క కింది నుంచి గుబురుగా కొమ్మలు వేస్తుంది. గింజలు గరకగా ఉంటాయి. మధ్య స్థలం కాయలు కాస్తాయి. 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది.

పూలేజీ 95311: కామూలి రకం గింజలు లావుగా హైబ్రిడ్‌లా ఉంటాయి. 95 నుంచి 100 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

విత్తుకోవడం ఇలా..

- విత్తనాలు ఎకరాకు 25 కిలోల నుంచి 30 కిలోల వరకు విత్తుకోవాలి. గింజ సైజును బట్టి లేదా ఆలస్యంగా డిసెంబర్ 15 తర్వాత వేసుకుంటే 20 శాతం పెంచాలి. లావుగా ఉండే కాబూలి రకాలు ఎకరాకు 30 నుంచి 40 కిలోలు వేసుకోవాలి.
- గొర్రుతో గానీ బర్రలతో గానీ జడ్డింగంతో గానీ విత్తుకోవాలి. భూమిలో పదును తక్కువగా ఉన్నప్పుడు నాగలితో విత్తుకోవచ్చు.

ఎరువులు: ఎకరాకు 8 కిలోల భాస్వరం. 16 కిలోల గంధకాన్నిచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి.

నీటితడులు: భూమిలో ఎక్కువగా తేమ ఉన్నట్లయితే నీరు అందించాల్సిన అవసరం ఉండదు. పూత, కాత దశలో ఉన్నప్పుడు భూమిలో పూర్తిగా పగుళ్లు తేలినట్లు ఉండి ఎండిపోయే సమయంలో కొద్దిపాటి నీరం దిస్తే సరిపోతుంది. శనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు ఇచ్చి అధిక దిగుబడి పొందవచ్చు. నీటితడులు పెట్టేటప్పుడు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పూత దశకు ముందు ఒకసారి, కాయ దశలో మరోసారి నీటితడి అందించాలి.

విత్తన శుద్ధి

- ఎండు తెగులు ఉన్నచోట కిలో విత్తనానికి 4 గ్రాములు ట్రైకోడెర్మా విరిడిని వాడితే మంచి ఫలితం ఉంటుంది.
- విత్తనానికి రైజోబియంకల్చర్ పట్టించి విత్తితే 20 శాతం నుంచి 30 శాతం అధిక దిగుబడి సాధించవచ్చు.
- 8 కిలోల శనగ విత్తనానికి ఒక రైజోబియం ప్యాకెట్ (200 గ్రాములు) కలిపి విత్తనం వేసుకుంటే పంటను చీడ పీడలు ఆశించవు.

పీవోను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీవో

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పీవో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలపై చర్చించారు. అదే విధంగా ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో పీవీటీవో భాస్కర్‌లు ఎమ్మెల్యేకు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్ మండల కేంద్రంలోని దర్గాను బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్గా వద్ద చాదర్ సమర్పించారు. ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎక్బాల్, మాజీద్, సలీం ఉన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

ఎదులాపురం: రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు సీఐటీయూలో చేరగా యూనియన్ కండువాలు కప్పి వారిని సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై, కార్మిక హక్కుల సాధన కోసం జైలు వెళ్లేందుకు సైతం వెరవకుండా సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ రిమ్స్ కార్మికుల హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలకు కార్మికులు ఆకర్షితులై సంఘంలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్మిక ఐక్యత, పోరాటం నినాదంతో సమస్యల పరిష్కారం కోసం ఉత్సాహంతో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.60 ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రిమ్స్, ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో రమాకాంత్, రమేశ్, వెంకన్న, సాయి, శివ, రాకేశ్, అశోక్, సోయబ్ పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం

బోథ్: ఈ ఏడాది మార్చి 7వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'అగ్గిపుడితే బుగ్గేనా..?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంతో బోథ్ పట్టణానికి చెందిన బోనగిరి కిరణ్‌కుమార్ జులై 7వ తేదీన ప్రజావాణిలో బోథ్‌కు ఫైర్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. కాగా స్పందించిన తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్‌సేఫ్టీ అధికారుల నుంచి సమాధానం వచ్చింది. అయితే ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వానికి నివేదికను ఇచ్చామని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని తెలిపారు.



అధికారులు పంపిన పత్రం